# హిల్ అండ్ వ్యాలీ

చోడా కోటేశ్వరరావు

**హిల్** అండ్ వ్యాలీలో ఉదయం ఎనిమిది గంటలకే వేకువ వెలుగులు తారట్లాడుతున్నాయి. జీరో వాల్ట్ బల్బ్ వెలుగులో తెరిపిడి పడని కళ్ళతో మత్తుగా, బద్ధకంగా చెరో వైపుకి తిరిగి పడుకున్న జంట బరువు క్రింద ఫోమ్ బెడ్ మెత్తగా అణుగుతోంది. అప్పుడే తెల్లారిపోయినట్లు, ఆలస్యమైపోయినట్లు స్టాండ్ మీది ఫోన్ గొంతు చించుకుంటూంది.

గృహలక్ష్మి గొంతుదాకా వచ్చిన విసుగుతో —

''ఏమండీ! మీ మంత్రిగారు చూడండి...సుప్రభాతం ఆరంభించారు. క్షణం విశ్రాంతిగా ఉండనీయరు. డర్టీ క్రీచర్స్!'' అంటూ రెండు చెవుల్లో వేళ్ళు జొనుపుకుంది మేడమ్.

రాత్రి రావ్ అండ్ కిషన్ వాళ్ళు ఇచ్చిన పార్టీ తాలూకు వాసనలు గొంతులో కదలాడుతూనే ఉన్నాయి ఇంకా.

''అదంతేలే, జానీ! నువ్వు రెస్టు తీసుకో.'' అనునయించాడు రఘుపతి.

''బట్ హౌ!...హౌ!'' బెడ్ మీదే చిందులు త్రొక్కేసింది మేడమ్ జానకి.

రఘుపతి చిరునవ్వు నవ్వి, ''దట్సాల్ రైట్'' అంటూ రిసీవరు తీసుకున్నాడు, ''యస్...'' అంటూ

''.....''

''యస్, రంగా ... నేనే.''

''....''

''బాంబే నుండి ట్రంక్ వచ్చిందా!''

''....''

''మధ్యాహ్నం ప్లేన్లో వస్తున్నారా?''

''....''

''ఫర్వాలేదు. గెస్ట్‌హౌస్‌కి ఫోనుచేసి నేను చెప్పానని చెప్పు. తర్వాత శివరావ్‌గారిని వెంటనే ఆఫీస్‌కి రమ్మని ఫోన్ చెయ్యి. నేనూ వచ్చేస్తున్నాను.

''....''

''ఆఁ .... రైట్.'''

''....''

''యస్ ... అలా చెయ్యి ... రైట్.''

రిసీవర్ హుక్ మీద పడేసి ''దట్సెట్, మేడమ్! కృష్ణ మోహన్‌గారు వస్తున్నారు.''

''అంటే ... మీ ఫైనాన్షియల్ బాస్!''

''కరెక్ట్! ఈ రోజు మజా తప్పదు. కాని, తలంతా దిమ్ముగా ఉంది, జానీ!''

''అవును. రాత్రి పార్టీ చాలా లేట్ అయింది గదూ! పోనీ కాస్సేపు పడుకోగూడదూ?'' గారాలు కురిశాయి ఆమె గొంతులో.

''నో. చాలా పని ఉంది'' అంటూ సిగరెట్ ముట్టించుకొని బాత్ రూమ్‌కి వెళ్ళిపోయాడు.

స్నానం ముగించి డ్రెస్సింగ్ టేబిల్ ముందు కూర్చున్నా ఇంకా తల దిమ్ము తగ్గకపోయేసరికి, ఇక లాభం లేదని షెల్ఫ్ తెరచి బాటిల్ ఓపెన్ చేసి రిలీఫ్ పెగ్ వేసుకుని —

''జానకీ!'' అని పిల్చాడు.

''ఇదిగో ఒక్క నిమిషం'' లంది జానకి బాత్ రూములోంచి.

ఒక్క నిమిషం తర్వాత బాత్ రూమ్ తలుపు తెరుచుకొని వచ్చి భర్త ప్రక్కనే నిలబడి.

''ఏమిటో పిల్చారు!'' అంది తల తడుచుకుంటూ.

మెదిలాడుతూ వస్తున్న షాంపూ పరిమళంతో జోడీ కట్టింది రొమాంటిక్ రెస్పాన్స్. నాలుగు దశాబ్దాలు నిండుతున్న తనువులో పాతికేళ్ళ పరువం పారాడుతోంది. మార్మికమైన భావోద్వేగపు ఒదుగులు పోయిం దామె గొంతు. తను సాధించిన ఆర్థిక ఔన్నత్యానికీ, సామాజిక అంతస్థుకీ, వృత్తిలో తన ప్రతిభా ప్రదర్శనకీ ప్రేరణ జానీయే నని రఘుపతి దృఢ విశ్వాసం. అనిమిషుడైన భర్త గుండె మీద చూపుడు వేలితో పాడుస్తూ—

''దేవ సార్వభౌమా! పరవశత్వం తర్వాత. ప్రస్తుతం శలవేమిటో!''

''పరవస్తు చిన్నయసూరి! ... శాంతం. పాపం!''

''పుణ్యకాలం కొంచెమే ఉంది. ఒంటి గంటకి ప్లేన్ దిగుతుంది. ఈ లోగా ఫైల్స్, ఫోన్ కాంటాక్టులు, ఏర్పాట్లు, ఎంగేజిమెంట్లు ఫిక్సప్ చేయడం ...''

''కరవేషు మంత్రీ! థాంక్యూ సోమచ్!''

''థ్యాంక్యూ ... న్నాటీ !!!''

''ఎస్ డియర్! మంచి ఆరంభం, మంచి ముగింపు'' అంటూ జానకిని వదిలేసి క్రిందికి వెళ్ళిపోయాడు రఘుపతి.

''గుడ్ మార్నింగ్, డాడీ!'' డైనింగ్‌హాల్లో ఎంత సేపటినుండో ఎదురు చూస్తున్న రమేశ్ తండ్రిని విష్ చేశాడు.

''మార్నింగ్, మై బోయ్!'' అంటూ కుర్చీలో కూర్చుంటూ— ''కమాన్, పరమేశ్వరన్? క్విక్!'' అని వంటవాడిని తొందరపెట్టాడు.

కాఫీ అయిపోతుండగా రమేశ్ — ''నిన్న చెప్పాను. ఈ వేళ మా ప్రొఫెసర్ గారికి పార్టీ నేను ప్రామిస్ చేశానని'' అని గుర్తుచేశాడు.

''అవును. జ్ఞాపకమే!'' అంటూ కాఫీ ముగించి బ్రీఫ్ తెరచి ముందు మాడు చెక్ రాసి ఇస్తూ —

''చూడు, రమేశ్! సరదాగా ఉండడం నాకూ ఇష్టమే. సరదా చేయటం కూడా నేను కాదనను. నీవుమటుకు క్లాస్‌లో రావాలి.''

''క్లాస్ మనకి కాకపోతే మరెవరికి, డాడీ! మీవన్నీ అనుమానాలు'' అంటూ లేచి వెళ్ళిపోయాడు రమేశ్.

రఘుపతికారు ఆఫీస్‌పోర్టికోలో ఆగేసరికిపదిన్నర కావస్తోంది. హోస్ట్ల న్యూస్ రివ్యూలు, సినీ కామెంటరీలు చేస్తున్న స్టాఫ్—బాస్ కారుచప్పుడు విని తమ తమ సీట్లలోకి జేరిపోయారు.

తన కుర్చీలో కూర్చుంటూనే కాలింగ్ బెల్ నొక్కి, సిగరెట్ వెలిగించుకున్నాడు రఘుపతి. లోపల కొచ్చిన ప్యూన్‌తో —

''శివరావ్ గారిని, అకౌంట్స్ చీఫ్‌ని, ఆర్. వో. ని రమ్మను'' అని చెప్పాడు.

రెండు నిమిషాల్లో ముగ్గురూ హాజరయ్యారు.

''శివరాంగారూ! ఒంటిగంట ఫ్లయిట్‌లో కృష్ణమోహన్‌గారు వస్తున్నారు. ఆఫర్స్ ఫైనలైజు చేసే ఆర్డర్సు వేయించాలి. ఏసియన్ ఎన్టర్ ప్రైజస్‌కి రింగ్ చేసి ఈ సంగతి చెప్పండి. రెడీగా ఉండాలని కూడా చెప్పండి. తరవాత ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ జాగ్రత్తగా తయారు చేయండి. జాగ్రత్తగా అంటే ...''

బాస్‌చిరునవ్వుని సరిగ్గా అర్థంచేసుకున్న రావ్— ''ఒ. కే. అలాగే, సార్'' అంటూ వెళ్ళిపోయాడు.

''ఆర్. వో. గారూ! మీరు జీప్ తీసుకొని గెస్ట్‌హౌస్‌కి వెళ్ళి అక్కడ ఏర్పాట్లు ఒకసారి చూసి కారియర్స్ రెడీ చేయండి. అలాగే ఇంటర్‌నేషనల్ వైన్ లింక్స్‌కి వెళ్ళిరండి. ఒ. కె.''

''ఎస్, సార్!''

''మరి ఆలస్యం చేయకండి''

ఆర్. వో. భాస్కరం వెళ్ళిపోయాడు.

''ఇక అసలు విషయం, శివరావ్‌గారూ! ఆఫర్స్ ఎలా ఉన్నాయి?''

''మద్రాస్ ఆఫర్ బాగుంది. తరవాత జాకబ్ అండ్ పీటర్స్ వాళ్ళది గూడా ఫర్వాలేదు. ఏసియన్ ఎన్టర్ ప్రైజస్ వాళ్ళది అంత బాగా లేదు.''

''నేను మాట్లాడుతాను. రివైజ్డు ఆఫర్ తీసుకోండి. వాళ్ళు మనకు ఎంతో సహకరిస్తున్నారు. వాళ్ళని త్రోసివేయడం అంతబాగుండదు. మద్రాస్ ఆఫర్‌ని, లోకల్ ఆఫర్‌ని రికమెండ్ చేస్తూ ఫైల్ బిల్డప్ చేయండి.''

''అలాగే'' అని శలవు తీసుకొని వెళ్ళిపోయాడు శివరాం.

రఘుపతి ఫోన్ ఎత్తి ఏసియన్ ఎన్టర్ ప్రైజస్‌కి డయల్ చేశాడు. రెస్పాన్స్ రాగానే—

‘‘హలో! ... ఎవరూ? ... శర్మగారూ!’’

‘‘. . . .’’

‘‘ఆఁ! నేనే. చూడండి, శర్మగారూ! ఈ రోజు ఫైనాన్షియల్ అడ్వయిజర్ వస్తున్నారు. ఈ రోజే ఆర్డర్సు పడిపోతాయి. మీ ఆఫర్ మరీ పూర్‌గా ఉందండీ! రివైజు చేయాలి. కనీసం మీ బిజినెస్ అయినా మీ కిద్దామని...’’

‘‘. . . .’’

‘‘అదే. మార్కెట్‌లో రేటు పుంజుకుంటుంది. మీరు వెంటనే వచ్చి రివైజ్డ్ ఆఫర్ శివరాం గారికి ఇవ్వండి. అదంతా నేను చూసుకుంటాను. ఒక గంటలో కావాలి. ఒ. కె!’’

‘‘. . . .’’

‘‘రైట్’’ అంటూ ఫోన్ పెట్టేశాడు. తర్వాత ఇంటి నెంబర్‌కి రింగ్ చేశాడు.

‘‘ఆఁ! జానకీ! నేనే. ఏరోడ్రోమ్‌కి బయలుదేరుతున్నాను. ఈ మధ్యాహ్నం భోజనానికి నా కోసం ఉండొద్దు. విజయ కాలేజికి వెళ్ళిందా?’’

‘‘ ’’

‘‘అలాగా! నాతోచెప్పలేదే! పోనీ నీదగ్గరఉందిగా—ఇచ్చి పంపించు.’’

‘‘. . . .’’

‘‘ఆల్‌రైట్. రాత్రి ప్రోగ్రాం ఇంకా ఫిక్సు కాలేదు. తరవాత చెబుతాను’’ అంటూ ఫోన్‌పెట్టేశాడు.

ఫైల్ బిల్డప్ చేసేసరికి పన్నెండు గంటలైంది. ఏరోడ్రోమ్‌కి చేరేసరికి పన్నెండూ ఇరవై అయింది.

లాంజులో రఘుపతితో షేక్‌హేండ్ చేస్తూ, ‘‘బై ది బై...వీరు శివారెడ్డిగారు. మన ఫరంతో క్రొత్తగా బిజినెస్ ప్రారంభించాలని ఉత్సాహపడుతున్నారు. శ్రీ ... గారు వీరిని గురించి స్వయంగా చెప్పారు. వీరి ఆఫర్ గూడా తీసుకోండి’’ అంటూ పరిచయం చేశాడు కృష్ణమోహన్.

‘‘ష్యూర్’’ అన్నాడే గాని, రఘుపతి బుర్ర మొద్దుబారిపోయింది. అప్పటికప్పుడే మద్రాస్ ఫరంతో షరతులన్నీ ఒప్పందం అయిపోయాయి. శర్మగారిని కాదనడం కుదరదు. అయినా, తమాయించుకున్నాడు.


లంచ్ పూర్తయి కృష్ణమోహన్ గదిలో నిద్ర తీస్తున్నప్పుడు అవతల గదిలో రెస్ట్ తీసుకుంటున్న, రఘుపతి దగ్గరకు వచ్చి కూర్చున్నాడు శివారెడ్డి.

‘‘చూడండి, శివారెడ్డిగారూ! చివరి క్షణంలో ఇలా పోటీకి రావడం!’’

‘‘క్షమించండి, రఘుపతిగారూ! నేనూ పదేళ్ళుగా వ్యాపారం చేస్తున్నాను. సాధక బాధకాలు నాకూ తెలుసు. మిమ్మల్ని మరీ అంత ఇబ్బంది ఎలా పెడతాను! బాలన్సు ఏమాత్రం ఉంటుంది?’’

‘‘రెండు లక్షలు ఉండవచ్చు మహా అయితే!’’

‘‘అయితే, ఒక పని చేయండి. మిగతా పార్టీలని ఎలాగైనా ఒప్పించి వాళ్ళ వాటాల్లో చెరి రెండు లక్షలు తగ్గించి మొత్తం ఆరు లక్షల బిజినెస్ నాకు వచ్చేలా ఏర్పాటు చేయించండి. మిగతా ఇద్దరికీ



షరతులుఏవైతే—నాకూ అవే. అదనంగా మీకు... ఏమంటారు?''

''సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తాను.''

''నాకు పని పూర్తవాలి. ఇదిగో మీ ఎడ్వాన్స్.'' రెండు కరెన్సీ కట్టలు రఘుపతి బ్రీఫ్‌లోని అరలో దూరిపోయాయి.

మొత్తానికి వ్యవహారం పూర్తయేసరికి సాయంత్రం ఏడు గంటలయింది. పార్టీ అందరూ లేచి బయటికి వచ్చారు. రఘుపతి గదిలో రఘుపతి, కృష్ణమోహన్ మిగిలి పోయారు.

''కృష్ణమోహన్‌గారూ! శివారెడ్డిగారు మీరు నా కారులో గెస్ట్‌హౌస్‌కి వెళ్ళి స్నానంచేసి విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. నేను ఇంటికి వెళ్ళి స్నానం చేసి ఎనిమిదిన్నర కల్లా వచ్చేస్తాను. ఈ లోగా ఏర్పాట్లన్నీ పూర్తవుతాయి'' అంటూ లేచాడు.

● ● ● ●

రఘుపతి జీప్ పోర్టికోలో ఆగేసరికి పరమేశ్వరన్ వచ్చి తలుపు తీశాడు. రఘుపతి స్నానం చేసి డ్రెస్ చేసుకుని హాల్లోకి వచ్చి, ''పరమేశ్వరన్! మేడమ్ ఇంకా రాలేదా?'' అని అడిగాడు.

''లేదు, సార్! ఈ వేళ క్లబ్‌లో మీటింగ్, డిన్నరూ ఉన్నదట. భోజనానికి రానన్నారు. రమేశ్ బాబు, విజయ ఇంకా రాలేదు.''

''సరే! నాకూ డిన్నరుంది. పిల్లలు రాగానే వాళ్ళకి సర్వ్ చేయ్'' అని జీప్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

● ● ● ●

''ఎక్స్క్యూజ్ మి ఫర్ ద డిలే'' అంటూ గదిలోకి వస్తున్న రఘుపతిని చూసి కృష్ణమోహన్ నవ్వుతూ విష్ చేశాడు.


''ఎలా ఉందండీ ఇక్కడి వాతావరణం!''

''బాగానే ఉంది. బైదిబై మన కంపెనీ బోర్డు ఈ ప్రాంతంలో మన వ్యాపారాన్ని ఇతర రంగాలకు విస్తరింప జేయాలని నిర్ణయించింది. ఇదే మంచి సమయం. మీరు అవకాశాలను సర్వే చేసి రిపోర్టు పంపండి. బోర్డు చేత నేను ఒప్పిస్తాను. వచ్చే సంవత్సరానికి మన వ్యాపార అంచనా యాభై లక్షలు కొంచెం ఇటూ అటూ...'' అంటూ లేచి వాటర్ కూలర్ నుంచి నీరు కూజాలో తీసుకొచ్చి టేబిల్ మీది మూడు గ్లాసుల్లో పోశాడు కృష్ణమోహన్. గ్లాసుల్లో నీరు ఒకే ప్రమాణంలో లేవు. ఒకటి పూర్తిగా నిండింది. కృష్ణమోహన్ తీసుకున్న గ్లాసులో సగానికి పైగానే ఉన్నాయి. రఘుపతి ముందున్న గ్లాస్‌లో బొటా బొటిగా సగానికే ఉన్నాయి.

రఘుపతి తన ముందున్న గ్లాస్‌ని పూర్తి చేసి పక్కన ఉన్న నిండు గ్లాసుని అందుకుంటూ.

''ఎక్స్క్యూజ్ మి, మిస్టర్ కృష్ణమోహన్! చాలా దూరం డ్రైవ్ చేసుకుంటూ వచ్చాను. దాహం తీరడం లేదు'' అంటూ తన గ్లాస్‌లోకి వంచుకోబోయాడు. కృష్ణమోహన్ అతణ్ణి వారిస్తూనే ''చూడండి, రఘుపతీ! అసలు పార్టీ సంగతి మరిచిపోతే ఎలా? తరవాత కంపెనీలో బాగుండదు అందుచేత.''

''ఓ! థాంక్యూ ఫర్ దిసజెషన్. అన్నట్లు శివారెడ్డిగా రెక్కడ?''




''లోపల వేడిగా ఉందని బయట లాన్స్‌లో తిరుగుతున్నారు. మంచి కస్టమర్. ఏమంటారు మీరు?''

''నాకూ అలానే అనిపిస్తూంది. అది సరే. తొమ్మిది కావస్తూంది. మరి ఓపెన్ చేద్దామా!''

''నేను ఎనిమిది గంటల నుండీ ప్రతి నిమిషం సిద్ధంగా ఉన్నానయ్యా, మహానుభావా! ఆలస్యమంతా మీదే.''

కాలింగ్‌బెల్ విని భాస్కరం పరుగుతూ పడుతూ లోపలికి వచ్చాడు.

''ఆర్. వో. గారూ! అంతా సిద్ధమేనా?'' ఇంకా ఏమైనా రావాలా?''

''ఆల్ రెడీ, సార్!''

''థాంక్యూ! శివారెడ్డిగారిని లోపలికి రమ్మని మీ రంతా వెళ్ళండి. మీకు ఆలస్యమై పోయింది.''

''డ్రైవర్ని ఉండమని చెబుతాను.''

''అయిడియా. కారులో వెళ్ళి భోజనం చేసి రమ్మను.''

భాస్కరం బయటికి వెళ్ళిపోయాడు. శివారెడ్డి లోనికి వచ్చి తలుపు మూసి వేశాడు. పాక్ తెరిచి బాటిల్స్ తీసి టేబిల్ మీద పెట్టాడు. ఐస్ ఫ్లాస్క్ పక్కనే పెట్టాడు. సోడా బాటిల్స్ కేస్‌ని అందుబాటులో ఉంచాడు. కారియర్ విప్పి తాండూరి చికెన్, రోస్టెడ్ ప్రాన్స్ ప్లేట్లలో సర్ది పెట్టాడు. శివారెడ్డి ఈ సంరంభంలో ఉండగా కృష్ణమోహన్ ఒక బాటిల్‌ని చేతిలోకి తీసుకుని గుండ్రంగా తిప్పుతూ ''ఓ టాప్ సీక్రెట్!'' అంటూ రహస్యంగా నవ్వుకుంటుంటే గుర్తించి శివారెడ్డి సాభిప్రాయంగా.

''సారీ, సర్! వైట్ హార్స్ ఒక్కటే దొరికింది.''

''అంటే...అందరికీ ఒకే గుర్రం...'' చిన్నగా నవ్వాడు రఘుపతి.

అమృతపానం ఆరంభమైంది. అమరవాణి వీణాలాపనం ప్రవాహం కట్టింది. పాన ప్రవాహం ఉరవడిలో ఐస్ క్యూబ్‌లు అలమటించి ఆవిరై పోయాయి. గుర్రం స్వారీ పూర్తయింది.

ముగ్గురూ కొత్త సిగరెట్లు వెలిగించారు.

''అండ్ నౌ ద టాప్ సీక్రెట్!'' భళ భళ నవ్వేశాడు శివారెడ్డి.

''అయితే దీని అంతం చూడవలసిందే'' అన్నాడు క్రిష్ణమోహన్ సిగరెట్ పొగతో రింగులు కొడుతూ.

తిరిగి గ్లాసులు నిండాయి. నిండిన గ్లాసుల్లో ఐస్ క్యూబ్‌లు తేలాయి. తేలుతున్న ఐస్ క్యూబుల్ని చూస్తూ తల పంకించి చిన్నగా నవ్వాడు కృష్ణమోహన్. రఘుపతి అతణ్ణి నవ్వుతూ చూసి—

''ఏమిటో ఆ రిసెర్చి?'' అన్నాడు.

''యు సీ, మిస్టర్ రఘుపతీ! తెల్లని మనస్తత్వంగల వాళ్ళు లోకంతో తాదాత్మ్యం చెందలేక ఇలాగే తేలిపోతుంటారుగదా!''

''అవును గానీ, ఇందులోనే మరో ధర్మసూక్ష్మం గూడా ఉంది, గురువుగారూ! క్షమించాలి చనువు తీసికుంటున్నందుకు. అలాంటి వాళ్ళని కరిగించు కొనేగదండీ లోకం చల్లగా ఉంటున్నదీ! ఏమంటారు?''

''ఎగ్జాక్ట్లీ. గొప్ప కవిత్వం చెప్పారు, సార్! మీరు కవి కాకపోవడం ఈ లోకం చేసుకున్న దురదృష్టం.''

''అంటే బిజినెస్ మాగ్నెట్ కావడం మీ అదృష్టం అంటారు. అంతేనా?'' కృష్ణమోహన్ అందుకున్నాడు.

''అబ్బే! మీ...మా...అన్న మీమాంస అవసరం లేదు, సార్! రఘుపతిగారు పరుసవేది. వారు తాకిన ప్రతివారూ బంగారుకొండే.''

''బంగారు కొండలు ఏం లాభం, మిస్టర్ రెడ్డీ! కొంగున ముడిబడే బంగారం కావాలి గానీ!''

''అంటే?'' అర్థంగానట్లుగా చూశాడు కృష్ణమోహన్.

''అంటే ఏంలేదు. అవసరానికి అందుబాటులో ఉండాలి. అనుభవాన్ని అందించాలి. అనుభూతుల్లో ఆనందాన్ని పండించాలి. పండిన ఆనందంలో బ్రహ్మ పదార్థం తళుక్కుని మెరుస్తుంది. అదే ఆనందో బ్రహ్మ.''

''చాల బాగా వివరించారు, రఘూ'' అభినందించాడు కృష్ణమోహన్.

''అయితే ఒక చిన్న అనుమానం మాత్రం తీరకుండా ఉంది. తమరు ఇంత...బ్రహ్మ జిజ్ఞాసులా! బాగానే ఉంది. మరి అంత బాగానూ అర్థ జిజ్ఞాసులా అయ్యారు. దీని భావమేమి తిరుమలేశా?''

''ఓ! అదా. చాల సింపుల్, మిస్టర్ మోహన్! తిరుమలేశుని భావమే నా భావం గూడా. అంటే కొంతమందికి కోపం రావచ్చు. 'ఎంత ఎంత బ్రహ్మ వేది అయితే మాత్రం ఇంత ఇంత పొగరా?' అని నా తత్త్వానికి ఎవరు పేరు పెట్టుకున్నా నా కేమీ కోపంరాదు గానీ, నేనుమటుకు నిజంగా కౌటిల్యుని అనుయాయిని. ఆయన సూక్తికంతా ముక్తాయింపేమిటో తెలుసా?'' అడిగాడు రఘుపతి.

''తెలీదు.''

''మీకు?'' శివారెడ్డి కేసి తిరిగాడు.

''అంత పెద్దవారి మాటలు నాకు బోధ పడవండి !''

''మరేం చేయడం? నేనే చెబుతాను. కౌటిల్యుడేమంటాడూ... ఆనందమే లేని జీవితం ఎవరికీ కూడదు. ధర్మం, కామం రెండూ కూడా అర్థం నుంచే ఉద్భవిస్తాయి కనుక మూడింటిలోనూ అర్థమే ప్రధానం—అని. ఇప్పుడర్థమైందిగదూ. బ్రహ్మ పదార్థాన్ని తెలుసుకోవాలంటే కొంగూ ఉండాలి. కొంగు బంగారమూ ఉండాలి.''

చప్పట్లు కొట్టబోయి తమాయించుకున్నాడు కృష్ణమోహన్.




''చూశారా ! మీరింకా బ్రహ్మ పదార్థాన్ని వెతుక్కుంటూనే ఉన్నారు. అది మీ తప్పుగాదండి, బాబూ! విస్కీది. దీనితో ఇహలోక బంధాలు విడిపోవు. వివేచన వదలదు. వివేచినంతసేపూ బ్రహ్మ పదార్థం గోచరించదు'' అంటూ కృష్ణమోహన్ ముందున్న గ్లాసు నింపాడు రఘుపతి.

''మా...స్టర్ ప్రతీ ! థాంక్యూ సోమచ్!'' కృష్ణమోహన్ కనురెప్పలు బరువుగా వాలుతూ వాలుతూ ఆగుతున్నాయ్. పెదవులు లావెక్కిపోయి నట్లుగా, స్పర్శజ్ఞానం కోల్పోతూ ఉన్నట్లుగా ఉంది. నాలుక కదలనని మొరాయిస్తున్నట్లని పిస్తోంది. చివరకి బలవంతంగా—

''అయామ్ వోవర్. మీరు కానివ్వండి ..'' అంటూ లేచి మంచంమీద కూర్చుని సిగరెట్ ముట్టించుకున్నాడు.

బాటిల్స్‌ని ప్రక్కకి సర్ది ప్లేట్లలో మిగిలిన కొంచెం పూర్తిచేసి దాన్లోనే చేతులు కడిగేసిన తర్వాత, బజర్ నొక్కాడు రఘుపతి. ప్యూన్‌వచ్చి అంతా ఎక్కడ దక్కడ సర్దివేసి ప్రక్కమీద దుప్పట్లు సరిచేసి వెళ్ళిపోయాడు. శివారెడ్డి సిగరెట్ పూర్తిచేసి, నిద్ర వస్తున్నదని గుడ్ నైట్ చెప్పి వెళ్ళిపోయాడు తన గదికి.

రఘుపతి మరొక సిగరెట్ వెలిగించుకుని—

''కృష్ణమోహన్‌గారూ ! బాగా చేశానంటారా?''

''ఓవ్‌కోర్స్...''

''ఈసారి ఇంకా బాగా చేస్తాను.''

''ఆల్‌రైట్. చేసి చూపించండి.''

''ష్యూర్...ష్యూర్.''

''వెల్, మిస్టర్ రఘూ ! ఆలస్యమవుతున్నట్లుంది.''

''ఏమీలేదు. మరొక అయిదు నిమిషాల్లో మీ కంపెనీ వచ్చేస్తుంది. గుడ్‌నైట్—గూడ్‌లక్'' అని బైటకి వచ్చేశాడు రఘుపతి.

అటువైపుగా ఉన్న వరండాలోంచి ఈవినింగ్ ఇన్ పారిస్ గాలిపై తేలి తేలి వస్తోంది. అటువైపుగా నడిచాడు. రోజీ, లూసీ కుర్చీల్లో కూర్చుని సిగరెట్స్ కాలుస్తున్నారు. రఘుపతిని చూసి రోజీ ఎదురుగా వచ్చింది.

''హాయ్, పతి ! మా సంగతే మర్చిపోయినట్లుంది.''

''నో ! రోజీ ! లూసీని రూమ్‌నెంబర్ వన్‌కి పంపి. నీవు వచ్చేయ్'' అంటూ వెనక్కి తిరిగాడు.

• • •

రోజీని, లూసీని కార్లో దిగబెట్టి రమ్మని డ్రైవర్‌తో చెప్పి, రఘుపతి వాచీ చూసుకున్నాడు. ఒంటిగంట దాటుతోంది. సిగరెట్ ముట్టించి సరదాగా పొగ వదుల్తూ—ఈపాటికి జానకి తన కోసం ఎదురు చూసి చూసి. నిద్రపట్టక మసలి మసలి కునుకు తీస్తూ ఉండవచ్చు అనుకున్నాడు.

• • •

జానకి ఆ సాయంత్రం ఆరుగంటలకే ట్రిమ్‌గా తయారయి క్లబ్‌కి వెళ్ళింది. కాస్సేపు సెక్రటరీతో బాతాఖానీ వేసింది. తరువాత కొంత సేపు కార్డ్స్ ఆడింది. చేయి బాగానే ఉంది. మొదటి రవుండ్‌లో రెండు షోలు చేసింది. రెండో రవుండ్‌కి కార్డ్స్ కలుపుతుంటే ఏషియాటిక్ ఎన్టర్ ప్రైజస్ మానేజింగ్ డైరెక్టరు శర్మ వచ్చాడు. వస్తూనే—

''గుడ్ ఈవెనింగ్, మేడమ్ ! మీ సహాయానికి చాల థాంక్స్'' అంటూ తనూ కార్డు తీశాడు.

''వ్యవహారం పూర్తయిందా!'' అన్నది జానకి.

''ఆహా ! మీరు తల్చుకుంటే కాకపోవడమా!''

రెండో రవుండ్ పూర్తయింది. శర్మ అందరికీ డ్రింక్స్ తెప్పించాడు. తాను సిగరెట్ ముట్టించుకొని, ''అసలు నేను కృతజ్ఞత తెలుపుకొనేందుకు. వచ్చాను. మీరేమో ఆట మజాలో ఉన్నారు'' అన్నాడు.

జానకి నవ్వేస్తూ—''రాగానే చెప్పేశారుగా!'' అంది.

''ఒట్టి గాత్రంతంగాణ్నిగా చేసేయకండి మరి. పత్రం, తోయం, ఫలం, పుష్పం లాంటివి ఇలాంటి సందర్భాల్లో ఎంతో సముచితమైన సామాగ్రి. ఏమంటారు'' అంటూ జానకికేసి సాభిప్రాయంగా చూశాడు.

జానకి చిరునవ్వు నవ్వి—''మీరంటే భక్తిగా కొలుస్తానంటే... ఆల్‌రైట్. యూ కారీ ఆన్ ఫ్రెండ్స్'' అంటూ లేచింది.

బయటికి రాగానే—''రండి, జానకీ! నా కార్లో లిఫ్ట్ ఇస్తాను'' అని డోర్ తెరిచాడు. కారు స్టార్ట్ చేసి, ''చెప్పు—ఎక్కడికి పోదాం?'' అన్నాడు.

''ఏం అలా అడుగుతున్నావ్! రఘు ఈ రాత్రంతా కృష్ణమోహన్‌తోనే ఎంగేజ్ అవుతారా యేం?'' అని అడిగింది అనుమానంగా.

''వాళ్ళ ఏర్పాట్లు చూస్తే అలాగే అనిపిస్తోంది.''

జానకి అంతరాళపు పొరల్లో ఏదో కసి బుస కొట్టింది. అయినప్పటికీ సాంఘిక మర్యాద తాలూకు మందహాసాన్ని పెదవులమీద మెరిపించి, ''అలా చెప్పు ! అయితే నిద్ర వచ్చేదాకా నీకు కంపెనీ ఇవ్వనా! భరించగలవా?''

''నేనే రిక్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. మీ రెప్పుడూ ముందడుగే.''

''థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్ ! కమాన్. లీడ్ మీ!''

కారు వీధిలోని వెలుగు నీడల్లోంచి దూసుకుపోయి శర్మ ఇంటిముందు పోర్టికోలో ఆగింది. బోయ్‌ని పిల్చి తాళం చెవి ఇచ్చాడు. వాడు తలుపు తెరిచి రాగానే, పర్సు తెరిచి డబ్బు ఇచ్చి కావలసినవి చెప్పాడు. వాడు వెళ్ళిపోయాడు. తరువాత ఇద్దరూ దిగి ఇంట్లోకి నడిచారు.

మరో అరగంటలో బోయ్ తెచ్చిన బాటిల్, కేరియర్ ఖాళీ అయ్యాయి. శర్మ సిగరెట్ ముట్టించుకుని సోఫాలో జేరబడ్డాడు. జానకి మరో సోఫాలో జేరబడి కళ్ళు మూస్తూ తెరుస్తూ, కప్పుకేసి చూస్తూంది. జానకి ముఖం విచిత్ర భావోద్వేగరేఖాస్ఫూర్తి మంత మవుతోంది. మత్తుగా వాలిపోతున్న సోగకన్నుల తెల్లదనంలో అలము కుంటున్న అరుణ రేఖల దారివెంట తరుణ వాంఛలు కవాతు చేస్తున్నాయి. అంతకుముందు కొన్నివందల సార్లు వోడిపోయిన ఒక స్త్రీ తత్త్వం తిరిగి ఎదురు తిరుగుతోంది.

'నీవు గృహిణివి. ఇద్దరు ఎదిగిన బిడ్డల తల్లివి. ఇప్పుడు సమాజంలో మీ అంతస్తు చాల ఉన్నతమైనది. నీవూ చదువుకున్నదానివే. నీ భర్త సమర్థుడే—నిన్ను మన్నించుకొనేవాడే. బంగారు కలలాంటిది నీ జీవితం—పొంగారిన పాలలాంటిది నీ సౌఖ్యం. ఈ కల్చర్ వద్దు. నలుగురిలో పల్చనైపోవద్దు...ప్లీజ్!' అని బ్రతిమాలుతోంది ఆమెలోని సోఫిస్టికేటెడ్ రెబెల్.

'అవుననుకో. అయినా నీది తత్త్వం... నాది జీవితం. నీది ప్రాథమిక నైతిక రీతి పరిరక్షణ. నాది అధునాతన అనుభవాల అన్వేషణ.' ఆమె ఆలోచనలకి పదునెక్కుతోంది. 'జీవితం తెల్ల కాగితంలా ఉండాలంటావేమిటి! నాన్సెన్స్. వివిధ వర్ణ సౌందర్యంతో చిత్ర రచనతోనో, వినూత్న భావ సౌరభ్యంతో కవితా రచనతోనో ముద్రపడిపోవాలి గాని. అలా అయితే నలుగురి కళ్ళలోబడి, నలుగురి నోళ్ళలో నానుతానంటావ! తెల్ల కాగితానికున్న స్వచ్ఛత ఉండదంటావా! ఈ వివేచనంతా స్వార్థం ఆవహించిన సాంఘికవర్గం యొక్క జీవన దృక్పథం ఏర్పరచిన వ్యవస్థ. కాకపోతే నైతిక రీతి నా కొక్కదానికే ఉద్దిష్టమా! ప్యూరిటీ నా కొక్కదానికే ఉపలక్షితమా! సంయమనం నా కొక్కదానికే నిర్దేశితమా! రఘు యేంజేస్తున్నాడు. గృహ యజమానిగా అధికార నిర్వహణ తప్ప. మగవాడు గనుక సెక్స్ ప్రాబల్యంతో ఆడదాన్ని లొంగదీయడం తప్ప. ఐశ్వర్యవంతుడు గనుక భోగలాలసత మప్పడంతప్ప. వ్యక్తిగతంగా నైతిక నిష్ఠ ఉందా? లేదూ— సాంసారిక పవిత్రతని పాటిస్తున్నాడా? పోనీ, సామాజిక సమతా న్యాయాన్ని భావిస్తున్నాడా కనీసం? కాదూ— చేస్తున్న వృత్తికి లాయల్‌గా ఉంటున్నాడా? సరే ఇవన్నీ లేవు. 'వద్దు' అనో, 'సాధ్యం కావు' అనో అనుకుందాం మాట వరసకి. కనీసం మానవతా దృష్టితో తన కింత ఉండి గూడా లేనివారిని దోచుకోకుండా ఉండగలుగుతున్నాడా? అతనికి లేని గృహ, సామాజిక, నైతిక సంబంధమైన ప్రాథమిక సూత్రాల మీద గౌరవం నాకే ఎందుకుండాలి?' అని అడుగుతోంది.

'ఎందు కుండగూడదు? అతనిలో ఫలానివి లేదని విమర్శిస్తున్నావు! కసిని పెంచుకుంటున్నావు! ఆ విమర్శతోనే, ఆ కసితోనే అతనిలో లోపించిన వాటిని నీలో ఎందుకు పెంపొందించుకోలేవు? అతనికంటే గొప్పదానివి ఎందుకని కాలేవు?'

'అయి యేం బావుకుంటావ్? ఎక్స్‌క్యూజమి! నేను అతని సహచరిని కేవలం అతనికే గాదు. అతని ప్రవృత్తికి గూడా. అర్థమైందా!' విస్కీ ఆమె రక్తంలోకి ఎక్కి వస్తూంది. 'సోసో...' అనుకుంటూ శర్మతో చేయి కలిపింది.

● ● ● ●

జానకి బాత్‌రూముకివెళ్ళి ముఖంతుడుచుకుంటూ హాల్లోకి వచ్చేసరికి గడియారం పదకొండు గంటలు చూపుతోంది.

''శర్మా! నిద్ర వస్తోంది. ఇంక వెడతాను'' అంది.

''పద నిన్ను డ్రాప్ చేసి వస్తాను'' అంటూ లేచాడు శర్మ.

జానకి చివాల్న తల త్రిప్పి అతనికేసి చూసింది. ఆమె చూపులు ఇంకా ఎర్రగానే ఉన్నాయి. అయితే ఇందాకటి ఎరుపులో మెరిసిపడ్డ ఉత్తేజం ఇప్పటి ఎరుపులో విరుచుకపడ్డ జ్వాల అంతే తేడా.

''అవునా! డ్రాప్ చేస్తావా? అవును. నన్నందరూ డ్రాప్ చేసేవాళ్ళే.''

''అదేమిటి, జానకి! చాల విచిత్రంగా మాట్లాడుతున్నావ్! నే నన్నదాంట్లో తప్పేముంది?''

''నీ తప్పేంలేదు, శర్మా! నేనే దురదృష్టవంతురాల్ని. నన్ను తెలిసిన వాళ్ళందరూ నన్ను డ్రాప్ చేసేవాళ్ళే—పడిపొమ్మంటూ. పడిపోతున్న నాకు లిఫ్ట్ ఇచ్చే వారొక్కరూ లేరు.''

''ఈవాళ నీ వూహలు చాల చిత్రంగా ఉన్నాయి. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటే అంతా బాగయిపోతుంది. బయలుదేరు'' అంటూ కారు స్టార్ట్ చేశాడు.

జానకి మాట్లాడకుండ వచ్చి కారెక్కింది. హిల్ అండ్ వ్యాలీ పోర్టికోలో జానకి దిగింది.

జానకిని దించిన కారు నగరంలోకి పారిపోయింది.

ఆమె వరండాలోకి వచ్చేసరికి లైట్ వెలిగింది.

తలుపు తెరుచుకుని పరమేశ్వరన్ బయటికి వచ్చాడు.

''ఏం? ఇంకా నిద్రపోలేదా?'' అడిగింది జానకి.

''అబ్బాయి గారింకా రాలేదు, మేడమ్!''

''బేబీ భోంచేసి పడుకుందా?''

''ఆకలి లేదని అలాగే నిద్రపోయింది.''

''సరే వెళ్ళి పడుకో'' అంటూ విజయ గదిలోకి వెళ్ళి స్విచ్ వేసింది.

చీకటి గదిలో కళ్ళు మూసుకుని పడుకొని, ఆవరించుకున్న తిమిరాంతరాళ మహాశూన్యంలో వెలుగు రేఖ కోసం వెతుక్కుంటున్న విజయ—నయనాంచలాలపై విరుచుకుపడ్డ విద్యుత్ వెలుగుకి దిగ్గున లేచి కూర్చుంది. తలయెత్తి తల్లి వంక చూసింది. ఆతల్లి కళ్ళలో అమావాస్య దివసావసానవేళా పరివ్యాప్త తిమిరచ్ఛాయల్ని చూసింది. తాను చూడ గూడనిదేదో చూసినట్లు చప్పున తలదించుకుని—

''ఏంమమ్మీ! ఇప్పుడే వచ్చావా?'' అన్నది విజయ.

కూతురు అడగబోయి, అన్నమాట వెనుక వూహనీ, ఆ వూహకి మూలమైన సంశయాన్నీ అవగతం చేసుకునిజానకి మరోవైపు దృష్టి మరల్చి—

''అవునుగాని, బేబీ! రమేశ్ ఇంకా రాలేదూ!'' అని అడిగింది.


''ఈ రాత్రికి రాడేమో! వాడూ, వాళ్ళ ప్రొఫెసరూ రాత్రి ఎనిమిది గంటలప్పుడు హోటల్ లైట్ అండ్ షేడ్‌లోకి వెడుతూ కనిపించారు. అమ్మా ఒక్క మాట అడుగుతాను చెబుతావా?''

''ఏమిటేం అంత విశేషం?'' అన్నది నవ్వుతూ.

''ఈ మధ్య వీడు డబ్బు ఎక్కువగా ఖర్చు చేస్తున్నాడు గదూ!''

''చేస్తున్నట్లే ఉంది''

''నీవు చేస్తున్నట్లే ఉంది అంటే వాడు చేస్తున్నాడు అనే అర్థం. ఈ మధ్య గర్ల్‌ఫ్రెండ్స్‌తో థియేటర్లలోనూ, అక్కడా కనిపిస్తున్నాడు. మమ్మీ! డబ్బు ఖర్చవుతుందనిగాదు. ఫ్యూచర్, మమ్మీ, ఫ్యూచర్.''




''నీవూ ఖర్చు పెడుతున్నావుగా, బేబీ!''

''నో, మమ్మీ, నో. నేనూ ఫ్రెండ్స్ కోసం కంపెనీ కోసం ఖర్చు పెడుతున్న మాట నిజమే. పెర్మిసివ్ సొసైటీమట్టూ తిరుగుతున్న మాట గూడ అబద్ధంగాదు. కాని, ఆ సోషల్ సర్కిల్ లోపలికి మటుకు ఇంత వరకు అడుగు పెట్టలేదు. నాక్యారెక్టర్ గూడా.. నన్ను నమ్మ, మమ్మీ! నా చేతుల్లోనే ఉంది. ఇంత వరకూ ముందుని హరించే ఆలోచిస్తున్నాను. కాలేజీ మాని వేయడానికి నిర్ణయించుకున్నాను.''

''ఏమిటేమిటీ—కాలేజీ మానేస్తున్నావా?''

''అవును, మమ్మీ! ఆ సర్కిల్లోని ఆకర్షణలు నామనస్సుని ప్రలోభ పెడుతున్నాయి! శ్రీగంధం చెట్లు మంచిదే మరి వాటిని పెన వేసుకున్న భయంకర సర్పాల సంగతో! అలా ఉంది ఆ వ్యవస్థ. ఆ ఆకర్షణలు ఎంత భయంకరమైనదో వాటి పాలబడ్డ బ్రతుకు రానురాను వింత విహ్వలమై, పోను పోను ఎంత వినష్టమై చివరికి. . చివరికి ఏమవుతుందో

వంటింట్లో మసిగుడ్డని అడిగితే అది చెబుతుంది, మమ్మీ!''

''బాగుందే, బేబీ! కాలేజీకి వెళ్ళి కల్చర్ నేర్చుకో మంటే కవిత్వం నేర్చు కుంటున్నావా! మసిగుడ్డ ఏమిటే నీ తలకాయ!'' అంది నవ్వుతూ.

''అలా నవ్వేయకు, మమ్మీ! ఇతరుల చేతులు కాల కుండా పొయ్యి మీద గిన్నె దింపడానికి ఉపయోగ పడుతూ తనకి మాత్రం మసిని అంటించు కుంటుంది. మంగళ స్నానం చేసి మధుపర్కంగా చుట్టుకోవడానికి పనికొస్తుందా మమ్మీ!''

చురకత్తి గుండెలో దిగినట్లు జానకి చూపులు నిలిచి పోయాయి.

''నో మమ్మీ! ఆ పరిస్థితుల్లో నన్ను నేను నిభాయించు కోవడం చాలా కష్టమవుతూంది. రేపటి నుండీ కాలేజి మానేస్తున్నాను. నన్ను ఒక మంచి దారిలో పెట్టు, మమ్మీ!'' అంటూ ఉద్వేగంతో చెప్పుకు పోయింది విజయ.

తర్వాత కొంత సేపటికి తేప్పరిల్లిన జానకి ''నీవు మంచి తల్లివి, బేబీ! అలాగే ఇంక పడుకో'' అని వెను దిరిగి లైట్ తీసివేసి, గదితలుపులు చేరవేసి మేడ మీద తమ బెడ్ రూముకి వెళ్ళిపోయింది.

బెడ్ మీద పడుకుని చీకట్లో తిరుగుతున్న సీలింగ్ ఫాన్ నవ్వడిమీదే ధ్యాస నిల్పింది. ఆ నవ్వడిలోనే విజయ మాటలు గింగురు మంటున్నాయి. 'బేబీ విజయా! నీ వెంత బుద్ధి మంతురాలివే! నిన్ను కన్న వాళ్ళం, నీకు ఆ ఆట నేర్పిన వాళ్ళం మేమే జయించ లేక పోతున్నాం. ఈనాడు మనిషి చుట్టూ సాలె గూడులా అల్లుకుంటున్న నైతిక ఆకర్షణలూ, వీటివల్ల పెచ్చరిల్లుతున్న వ్యామోహ ప్రవృత్తులూ యెన్నెన్ని! ఇవి మనిషి చుట్టూ కల్పిస్తున్న అయ స్కాంత ఆవరణం యెంత బలవత్తరమైనదో! ఈ అయస్కాంత శక్తి ముందు మేము ఇనప ముక్కలమై పోతున్నాం, విజయా! ఇది మమ్మల్ని గృహ కేంద్రం నుండీ, నైతిక పీఠం నుండీ, మాన వత్వపు ఊహల నుండీ, విద్రం చేసి వడలాక్కొని పోతున్నాయి. చివరికి మేము యేమయి పోతామో మాకే తెలియడంలేదు. ఇనప ముక్కలు యేనాడు తాయే! వాతావరణం ప్రభావానికి త్రుప్పుపట్ట పోతాయేమో! ఏమో కాని, నిన్ను ఈ సర్కిల్ నుండి తప్పిస్తాను. ఈ ఒక్క తృప్తైనా మిగుల్చుకుం టాను' అనుకుంటూం టే తలగడ నల్లగా అయిపోతోంది.


''ఎక్స్‌క్యూజ్ మి, జానీ!''

కళ్ళు తెరిచి చూసింది జానకి. అప్పుడే డోర్ తెరుచుకుని లోనికి వస్తూ బట్టల స్టాండ్ వైపు వెడుతున్న రఘు కనిపించాడు. లేచి కూర్చుని కళ్ళు తుడుచుకుంది.

''ఒన్ మినిట్!'' అంటూ బాత్ రూముకి వెళ్ళి పోయాడు రఘు.

నవ్వుకుంది జానకి.

'ఇరవై ఏళ్ళ విషాదాన్ని తాను భరిస్తూంటే ఒన్ మినిట్ అంటూ వోదారుస్తున్నాడు ఇతగాడు. ఒన్ మినిట్‌లో కృతయుగాన్ని ప్రవర్తిల్ల చేస్తాడు కాబోలు.' తిరిగి నవ్వుకుంది, ఏడవడానికి మనసు చాలక.




టవల్‌తో ముఖం తుడుచుకుంటూ బాత్ నించి వచ్చేశాడు రఘు.

''చాల అలసి పోయాను, జానీ! నిద్ర వస్తూంది. గుడ్ నైట్'' అన్నాడు, ఎర్రగా ఉన్న కళ్ళు మూతలు పడుతుంటే.

''గుడ్‌నైట్ ఎవరికి— మీకా!... నాకా!...''

మత్తులో నుంచే కళ్ళు తెరచి చూశాడు రఘు పతి భార్యవంక. మసక తెరల్లోంచి అంతా మామూలు గానే ఉంది అతనికి.

''వ్హాట్, జానీ! ఏమైంది? గుడ్‌నైట్ మనిద్దరి కీనూ!'' అన్నాడు.

''మీకూ, నాకూ గుడ్‌నైటేనిటీ! అయితే గియితే మన బేబీకవుతుంది గాని!''

''అంటే?''

''అది చదువు మానేస్తుందట. పెళ్ళిచేసి అత్త గారింటికి పంపమని యెలా అడగడమాని సతమత మవుతూంది.''

''అంత తొందర రే వొచ్చింది.''

''ఇంకా ఆలస్యం చేస్తే తను బాగుపడే అవ కాశం చేజారి పోతుందేమోనని. మన వేషం.. భాష అంతస్తులూ.. అం.. త:.. క.. ర.. ణ.. .లూ— వీటిని అలుము కుంటున్న సంస్కారాభాసలూ చూసి పాపం పిచ్చిపిల్ల భయపడిపోతూంది. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా మన సర్కిల్ నుండి తప్పు కోవాలని చూస్తూంది. ఈనాడు తెగించి బయట పడ్డది. నిజంగా గుడ్‌నైట్ దానికి కదూ! ప్లీజ కంగ్రాట్యులేట్ హర్'' అంటూంటే జానకి వైపు దిమ్మెరపోయి చూస్తుండి పోయాడు రఘుపతి ఎంతోసేపు ...ఎంతోసేపు...

● ● ● ●

ఉలిక్కి పడ్డాడు రఘుపతి. ఫోన్ రింగవు తూంది, ఎంత సేపటి నుండో. రిసీవరు అందు కున్నాడు.

''హల్లో...''

''....''

''యస్ రఘుపతి హియర్!''

''....''

''వ్హాట్! మై బోయ్!''

''    ''

''పొరబడుతున్నారేమో మరొక సారి చెకప్ చేయండి.''

''....''

''ఆల్‌రైట్. అవసరంలేదు. ఇప్పుడే వస్తున్నా.''

దిగ్గునలేచి కూర్చున్న జానకి తత్తర పడుతూ, ''ఏమిటే! రమేశ్ కేమైంది?'' అంది.

''వాడికేం, వాడు బాగానే ఉన్నాడు. నా ప్రిస్టేజే పోయి బంగాళాఖాతంలో కల్సింది.''

రఘుపతి విసుక్కోవడం జానకికి ఆశ్చర్యంగా ఉంది.

''ఏం జేశాడట?''

''వీడూ, వీళ్ళ ప్రొఫెసరూ, మరో ఇద్దరు కాల్‌గరల్స్‌తో కలిసి పాట్ స్మోకింగ్ మజా పార్టీలో ఉంటే పోలీసులు పట్టుకున్నారట'' అని అంటున్న భర్త మాటలు విని జానకి నివ్వెర పోయింది.

విస్కీ తాగినా తప్పన్నీ, అప్పన్నీ వదలని తండ్రి— పాట్ స్మోకింగ్‌తో బొందెతోనే పరలోక పాల వశ్యాల్ని జుర్రుకుంటున్న సుపుత్రుని కోసం బయలు దేరి పోతూంటే...

అయస్కాంత ఆవరణలో దిక్కూ దెసా లేకుండా తూలుతూ, జారుతూ పడిపోతున్న ఇనుప మనసులు వాతావరణ ప్రభావానికి త్రుప్పు తిని పోతుంటే చేసేది లేక యేం చేయగలిగిందీ తోచక నిర్విణ్ణయై కూర్చుండి పోయింది హిల్ అండ్ వ్యాలీ గృహిణి జానకి. ★